క్లుప్తంగా

విద్యార్థుల సామర్థ్యం మేరకు బోధన చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

ఉయ్యాలవాడ :విద్యార్థుల సామర్థ్యం మేరకు ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించాలని ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని మాయలూరు ప్రాథమిక పాఠశాలలో మండలంలోని ఉపాధ్యాయులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ముఖ్యంగా తరగతి గదిలో సీ, డీ గ్రేడ్ విద్యార్థులను గుర్తించి ఏ,బీ గ్రేడులకు వచ్చేలా ఆంగ్లం, గణితం మూల్యాంకణాలపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. అలాగే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం వడ్డించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పెండింగ్ జీతాలు విడుదల చేయాలి


ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఏపీ సీఓఎస్ ఉద్యోగుల పెండింగ్ జీతాలు విడుదల చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాముడు, రణత్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 నెలలుగా ఉద్యోగం చేస్తునా జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. న్యాయ శాఖ మంత్రి, ఎంపీ స్పందించి జీతాలు విడుదల చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు విష్ణు, రవి, మధు, ఏపీసీఓఎస్ ఉద్యోగులు జక్కం రవి, మల్లేశ్వరి, హరికృష్ణ, ఇంద్రసేనారెడ్డి, వినోద్‌కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆడిట్ ప్రారంభం


రికార్డులు పరిశీలిస్తున్న ఆడిటర్ రవికుమార్

శిరివెళ్ల: మండల పరిషత్ ఆడిట్ మంగళవారం ప్రారంభమయింది. జిల్లా ఆడిటర్ రవికుమార్ 2013–14 సంవత్సరానికి చెందిన 14,15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు, జమ, ఖర్చు, పనుల వివరాలు, జనరల్ ఫండ్ రికార్డులు, రశీదులను పరిశీలించారు. జిల్లాలో మహానంది, గోస్పాడు మండలాల పరిషత్ ఆడిటింగ్ పూర్తయిందని ఆడిటర్ తెలిపారు.

రక్తదానం


రక్తదానం చేస్తున్న బీజేపీ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని మంగళవారం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించుకున్నారు. మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. విజయ బ్లడ్ బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు కార్యకర్తలు రక్తం దానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు లింగారెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ అభిరుచి మధు, పట్టణ అధ్యక్షుడు కొట్టె చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఇనుగూరు రమేష్ బాబు, గాండ్ల ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి చల్లా మధు, కార్యదర్శి పసపుల శివసాయి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు బత్తిని స్వాతి పాల్గొన్నారు.

నిందితుల అరెస్టు

శిరివెళ్ల: వ్యక్తి మృతి కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ చిన్న పీరయ్య మంగళవారం తెలిపారు. ఈ నెల 12న చెన్నూరులో పొలంలో గుంత తవ్వే విషయంలో గొడవ జరిగిందన్నారు. ఘర్షణలో బండారు సుబ్బరాయుడు మృతి చెందాడు. ఈ విషయంలో నిందుతులైన పెద్ద నాగిరెడ్డి, మహేశ్వరరెడ్డిని దీబగుంట్ల మెట్ట వద్ద అరెస్ట్ చేసి ఆళ్లగడ్డ కోర్టులో హాజరుపరిచామని చెప్పారు.

కొనసాగుతున్న భక్తుల సందడి

మహానంది: భాద్రపద మాసం పురస్కరించుకుని మహానంది ఆలయంలో భక్తుల సందడి కొనసాగింది. మంగళవారం పలు ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామిని దర్శించుకున్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

శ్రీశైలంటెంపుల్: ఇద్దరు వ్యక్తుల నుంచి 19 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జి.ప్రసాదరావు తెలిపారు. మంగళవారం శ్రీశైలం టోల్‌గేట్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సున్నిపెంటకు చెందిన భూమన వెంకటేశ్వర్లు, శ్రీశైలం గ్రామం మాణిక్యమ్మసెలకు చెందిన మాన్ల శివ వద్ద మద్యం బాటిళ్లు గుర్తించి స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కోయకుండానే కన్నీరు

- ఆకాశాన్నంటుతున్న ఉల్లి ధర
- మార్కెట్‌లో ప్రస్తుతం కిలో ఉల్లి రూ.60

నంద్యాల(న్యూటౌన్): గతంలో ఉల్లి కోస్తుంటే కన్నీరు వచ్చేది. ఇప్పుడు కొనాలంటేనే ఆ పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికే పెరిగిన ఉల్లి ధరలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వాటి ధర మరింత పెరగనుంది. ప్రస్తుతం మార్కెట్లో కిలో ఉల్లి రూ.60 పలుకుతోంది. నాలుగైదు రోజుల్లో ఈ ధర మరింత పెరిగే అవకాశం ఉందని కూరగాయల దుకాణదారులు చెబుతున్నారు. కిలోకు రూ.10 నుంచి రూ.20 వరకు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం జిల్లాకు మహారాష్ట్ర నుంచి ఉల్లి దిగుమతి అవుతోంది. లోకల్ వంట అంటే మన రాష్ట్రంలోని కర్నూలు జిల్లాలో పండేపంట. సాధారణంగా


ఉల్లిగడ్డలు

లోకల్ పంట దిగుబడులు అందుకోగానే కొండెక్కిన ధరలు కొంత తగ్గుతాయి. అయితే రాష్ట్రంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోకల్ పంట అలా ఉంచి, మహారాష్ట్ర నుంచి వచ్చే దిగుమతులకు కూడా అవరోధం కలిగేలా ఉంది. ఈ నేపథ్యంలో ఉల్లికి డిమాండ్ పెరిగి, ధర ఎక్కువయ్యే అవకాశం ఉంది.

జిల్లాలో సుమారు 490 దుకాణాలు..

జిల్లాలో దాదాపు 105 పెద్ద, 490కి పైగా సాధారణ కూరగాయల దుకాణాలు ఉన్నాయి. వీటికి నిత్యం 225 నుంచి 300 టన్నుల ఉల్లి దిగుమతి అవుతోంది. హోల్‌సేల్ పాయింట్ల నుంచి రిటైల్ వ్యాపారులు కొనుగోలు చేసి కూరగాయల దుకాణాలకు తెచ్చుకుని విక్రయిస్తుంటారు. నంద్యాల జిల్లాలోని హోల్ సేల్ దుకాణాలకు మహారాష్ట్ర నుంచి లారీల్లో ఉల్లి దిగుమతి అవుతోంది. లోకల్ పంట అయిన కర్నూలు జిల్లా ఉల్లి ఈపాటికే జిల్లాకు దిగుమతి అయ్యేది. అయితే వర్షాల కారణంగా కొంత ఆలస్యమవుతుంది. వచ్చే వారానికి లోకల్ పంట అందుకుంటుందని కూరగాయల వ్యాపారులు అంచనా వేసినప్పటికీ వర్షాల కారణంగా పది నుంచి పదిహేను రోజులు పట్టవచ్చని అంటున్నారు. అప్పటి దాకా మహారాష్ట్ర నుంచి దిగుమతి అయ్యే ఉల్లిపైనే ఆధారపడాల్సి వస్తోంది.

'ఓజోన్' ప్రపంచ రక్షక పొర

చాగలమర్రి: ఓజోన్ ప్రపంచ రక్షక పొర అని నంద్యాల జిల్లా సైన్స్ కో–ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి, చాగలమర్రి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కోటయ్య పేర్కొన్నారు. హెచ్‌ఎం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఓజోన్ పొర పరిరక్షణ వారోత్సవాలకు ముఖ్య అతిథిగా కేవీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయనాలు, వాహనాల కాలుష్యం, క్లోరిన్ ఉత్పాదికాలు వినియోగించడం వలన వాతవరణ కాలుష్యం ఏర్పడి ఓజోన్ పొర దెబ్బతింటుందన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఓ మొక్క నాటి సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత


మెరిట్ సర్టిఫికెట్లతో విద్యార్థులు

పాఠశాల విద్యార్థులకు ఓజోన్ పొర పరిరక్షణ అంశంపై వ్యాస రచన, వకృత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, బహుమతులను ఎంఈఓలు అనురాధ, న్యామతుల్లాతో కలిసి వారు అందజేశారు.

'నారాయణ' విద్యార్థుల ప్రతిభ

నంద్యాల(న్యూటౌన్): స్థానిక పద్మావతినగర్‌లోని నారాయణ పాఠశాలలకు చెందిన విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు మంగళవారం ప్రిన్సిపాల్ అంజనిదేవి తెలిపారు. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగిన జూనియర్, సబ్ జూనియర్ జాతీయ జంప్‌రోప్ పోటీల్లో వెంకటసాయి మొదటి, కృష్ణ కార్తీక్ రెండవ, కీర్తి సౌమ్య మూడవ స్థానంలో నిలిచారన్నారు.

తెలుగు బాప్టిస్ట్ రక్షణాలయం కమిటీ ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): స్థానిక తెలుగు బాప్టిస్ట్ రక్షణాలయం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా ఇమ్మానియేల్, వైస్ ప్రెసిడెంట్‌గా చిలక సాల్మన్, సెక్రటరీగా ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా ముద్దవరం ఆనంద్, ట్రెజరర్‌గా కృపవరం, అసోసియేట్ ట్రెజరర్‌గా రెడ్డిపోగు సుధీర్, ఈసీ మెంబర్లుగా వీర దేవదానం, చాబోలు యువరాజు, ఇమ్మానియేల్‌లు గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు క్రిస్టఫర్ ప్రకటించారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


ఉయ్యాలవాడ మోడల్‌స్కూల్‌లో విద్యార్థినులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న ఎంపీడీఓ

రుద్రవరం: జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. రుద్రవరం పీహెచ్‌సీ పరిధిలో 5,013 మంది విద్యార్థులు ఉండగా అందరికీ మాత్రలు వేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. అలాగే ఆల మూరు, నర్సాపురం పీహెచ్‌సీల పరిధిలో విద్యార్థులకు మాత్రలు వేసినట్లు ఆయా పీహెచ్‌సీల వైద్య సిబ్బంది తెలిపారు.

90 శాతం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు

ఉయ్యాలవాడ : జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలో 90 శాతం మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు వేసినట్లు ఎంపిహెచ్‌ఓ దస్తగిరి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ఎంపీడీఓ ఉమామహేశ్వర రావు మాత్రలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి, ఏపీఓ రవిప్రకాష్, హెల్త్ సూపర్‌వైజర్ రామచంద్రుడు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

గోస్పాడు: జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోస్పాడు వైద్యాధికారి డాక్టర్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోండి


ఈకేవైసీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

నంద్యాల(అర్బన్): ప్రతి రైతు సాగు చేసిన పంటలను నమోదు చేయించుకోవడంతోపాటు ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు సూచించారు. మంగళవారం ఊడుమాల్పురం, భీమవరం రైతు సేవా కేంద్రాల్లో ఈ పంట నమోదు, ఈకేవైసీ కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఈనెల 23లోగా వందశాతం ఈకేవైసీ జరిగేలా చూడాలని గ్రామ వ్యవసాయ సహాయకును ఆదేశించారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

చాగలమర్రి: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతిఒక్కరూ ఓ మొక్క నాటి సంరక్షించాలని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. పచ్చదనం– పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా మంగళవారం చాగలమర్రి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమానికి పీడీ హాజరయ్యారు. మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ అమ్మ పేరుతో మొక్క నాటడంతోపాటు సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.


చాగలమర్రి మండల పరిషత్‌కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న డ్వామా పీడీ రామచంద్రారెడ్డి

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ)లో 4వ విడత అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏ.రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల ఫిట్టర్, టర్నర్, డ్రాఫ్ట్‌స్‌మెన్ సివిల్ కోర్సులకు, ఏడాది వెల్డర్ కోర్సుకు సీట్లు ఉన్నాయన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు, వెల్డర్‌కు పదవ తరగతి ఫెయిల్ అయిన వారు అర్హులని, ఈనెల 26వ తేదీలోగా www.iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9703395091, 9440748448, 9441181072 సంప్రదించాలన్నారు.

ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయండి

చాగలమర్రి: కేంద్ర ప్రభుత్వం మేజర్, మైనర్ గ్రామ పంచాయితీలకు మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని డి.వనిపెంట, నేలంపాడు సర్పంచ్‌లు బాలీశ్వరరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కలుగొట్లపల్లె, బ్రాహ్మణపల్లె గ్రామాల నాయకులు బ్రహ్మానందరెడ్డి, శ్రీనివాసరెడ్డి ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ తాహీర్ హుసేన్ కోరారు. ఈ నిధులు నంద్యాల జిల్లాలోని అన్ని గ్రామ పంచాయితీలకు అందాయని, ఆళ్లగడ్డ నియోజకవర్గానికి మాత్రం విడుదల కాలేదని వారు విన్నవించారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం సమస్యలు చాలా ఉన్నాయని, ఇప్పటికే సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేశామని సర్పంచ్‌లు చెప్పారు. నిధులు విడుదల చేయకపోతే సర్పంచులు ఇబ్బందులకు గురి కావలసి వస్తుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. స్పందించిన ఈఓపీఆర్డీ గ్రామ


ఈఓపీఆర్డీతో మాట్లాడుతున్న సర్పంచ్ బాలీశ్వరరెడ్డి, ప్రతాప్‌రెడ్డి

స్వరాజ్ యాప్ నుంచి పీఎఫ్‌ఎంఎస్ ద్వారా ట్రెజరీ ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు. అయితే నిధుల విడుదలకు పీఎఫ్‌ఎంఎస్ ద్వారా ప్రయత్నించగా ఏర్రర్ మేసేజ్ వస్తుందని, ఈ సాంకేతిక సమస్యను ట్రెజరీ అధికారులు పరిష్కరిస్తే నిధులు విడుదల అవుతాయని చెప్పారు.

అలరించిన భజన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణమాడ వీధిలోని నిత్యకళావేదికపై గాజులపల్లెకు చెందిన ఎస్.కృష్ణలలిత వారి భజన కార్యక్రమం అలరించింది. విఘ్నేశ్వర వినాయక, కరుణించరా శివా శ్రీశైలవాసా, పార్వతీ నాథుడా, శ్రీగిరి మల్లయ్య, పాతాళగంగమ్మ, కైలాసవాసుని, ఎవరికి ఎవరయ్యా ఈశ్వరా, ఈశా మహేశా, కైలాసగిరివాసా మొదలైన భక్తిగీతాలను, భజన కీర్తనలను తిరుపతి వెంకటయ్య, చంద్రశేఖర్, బసప్ప, రామచంద్రయ్య, భీమయ్య, రఘుపతి, యశోద, లక్ష్మీపద్మమ్మ, సుబ్బరత్నం, కోటేశ్వరమ్మ, సుహాసిని తదితరులు ఆలపించారు.


ఆలయంలో విశ్వకర్మ మహా శాంతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం


విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న దృశ్యం

ఘనంగా విశ్వకర్మ జయంతి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక పెద్దబండ వీధిలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో విరాట్ విశ్వకర్మ భగవానుడి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గోవింద మాంబ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానం అధ్యక్షుడు సూర్యప్రకాశ్ ఆచారి ఆధ్వర్యంలో ఉదయం గణపతిపూజ, స్వస్తి పుణ్యాహవచన, కంకణధారణ, అఖండ జ్యోతి ప్రజ్వలన, బ్రహ్మ మహా కలశస్థాపన, గాయత్రి విశ్వకర్మ ఆవాహన బ్రహ్మకలశ పూజా, పంచామృత అభిషేకం అనంతరం విశ్వకర్మ మహా శాంతి హోమం నిర్వహించి పుణ్యవహచనం నిర్వహిచారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు గురుప్రసాద్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజన పథకం అభినందనీయం

నంద్యాల(అర్బన్): ప్రపంచ మొదటి వాస్తు శిల్పి విరాట్ విశ్వకర్మను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశపెట్టడం అభినందనీయమని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సమితి అధ్యక్షుడు అరుణాచారి తెలిపారు. స్థానిక కార్యాలయ ఆవరణంలో మంగళవారం విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. జిల్లా బీసీ సంక్షేమ అధికారి ముస్తాక్ అహమ్మద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అరుణాచారి మాట్లాడుతూ రుగ్వేధమే విశ్వకర్మను ప్రపంచ వాస్తు శిల్పిగా కీర్తించిందన్నారు. కమ్మరి, వడ్రంగి, చిత్రకారులు, స్వర్ణకారులు, తదతర కుల వృత్తులకు మూలపురుషుడైన విశ్వకర్మ జయంతి వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు నాగేంద్ర, స్వర్ణకారుల సంఘం సభ్యులు మాదవ వర్మ, ఉస్మాన్ పాల్గొన్నారు.

వంద రోజుల ప్రణాళిక లక్ష్యాలను చేరుకోవాలి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(అర్బన్): వంద రోజుల ప్రణాళికలో భాగంగా శాఖల వారిగా నిర్దేశించిన లక్ష్యాలను అక్టోబర్ రెండో తేదీలోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో 100 రోజుల ప్రణాళికల లక్ష్యాల ప్రగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 400 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి చర్యలు తీసుకోవడంతో పాటు 57 ఆయిల్‌పామ్ ప్లాంట్లను ప్రోత్సహించేందుకు కృషి చేయాలన్నారు. 650 మినీ గోకులం షెడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. లీజులో ఉన్న 124 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, నాలుగు రిజర్వాయర్లలో చేపల పెంపకానికి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. సాగునీటి ప్రాజెక్టుల కనీస మరమ్మతులకు, అత్యవసర మరమతులకు రూ.32కోట్ల ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించామన్నారు. నందికొట్కూరులో 13వ శతాబ్దంలో నిర్మించిన సూర్యనారాయణ, కొలనుభారతి ఆలయాలకు సంబంధించిన ఫొటోల ప్రదర్శనకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ఫ్యాక్టరీలలో ప్రమాదాల నివారణకు యాజమాన్యాలకు నోటీసులు జారీ చేయాలన్నారు. గ్రామీణ, పట్టణ రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల పరిసర ప్రాంతాల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని క్లియర్ చేసి, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీపీఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. మంగళవారం భువనేశ్వర్ నుంచి ప్రధానమంత్రి మోదీ పీఎం ఆవాస్ యోజన 2.0 విధివిధానాలను వర్చువల్‌గా ప్రారంభించారు. కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నిరుపేదకు ఒక గూడు ఏర్పాటు చేయడం మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

'స్వచ్ఛత'లో భాగస్వాములు కండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి కోరారు. మంగళవారం గాంధీ చౌక్ వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలు, విద్యార్థుల చేత స్వచ్ఛతా హీ ప్రతిజ్ఞ చేయించి పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని సూచించారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను పరిశుభ్రం చేయడంతోపాటు మొక్కలు నాటి సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. స్వచ్ఛ జిల్లాగా మార్పు చేసేందుకు ప్రజలు భాగస్వాములు కావాలన్నారు.


నంద్యాలలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ రాజకుమారి

అయ్యలూరులో..

నంద్యాల(అర్బన్): స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని అయ్యలూరు గ్రామ పంచాయతీ ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై ఈఓఆర్డీ వెంకటేశ్వరరావు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి నరేంద్ర పాల్గొన్నారు. అలాగే నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని భీమవరం గ్రామంలోని ప్రభుత్వ, ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీడీఓ సుగుణశ్రీ పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. అల్‌బెండజోల్ మాత్రలు వేసుకుని నులి పురుగులను నివారించుకోవాలని విద్యార్థులకు సూచించారు.

- **గోస్పాడు:** మండల వ్యాప్తంగా మంగళవారం స్వచ్ఛతా హీ కార్యక్రమాలు నిర్వహించారు. వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగఅనసూయ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత పంచాయతీలే ప్రభుత్వ ధ్యేయం


చాగలమర్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న రాజకీయ నాయకులు, అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది


ఉయ్యాలవాడ బస్టాండు ఆవరణలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న విద్యార్థులు

చాగలమర్రి: ప్లాస్టిక్ రహిత గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని మండల ప్రత్యేక అధికారి, జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్ హుసేన్, డీఎల్‌పీఓ రాంబాబులు పేర్కొన్నారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా ఈఓపీఆర్డీ తాహీర్ హుసేన్ ఆధ్వర్యంలో మంగళవారం చాగలమర్రిలో ర్యాలీ నిర్వహించారు. గాంధీ సెంటర్‌లో మానవహారం ఏర్పడి ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చదనం, పరిశుభ్రత ప్రాముఖ్యతను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబ్ దౌలా, ఎంఈఓలు అనురాధ, న్యామతుల్లా, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

ఉయ్యాలవాడ : పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రం ఉయ్యాలవాడ మండల పరిషత్ కార్యాలయం నుంచి అధికారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండు ఆవరణలో మానవహారం నిర్వహించారు. పరిసరాల శుభ్రతపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, మండల అధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ, ఎస్‌ఐ రామాంజనేయులురెడ్డి, సర్పంచ్ మేకల ఓబులేస్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుదాం

రుద్రవరం: మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో మంగళవారం స్వచ్ఛ తాహి సేవ కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల సచివాలయ ఉద్యోగులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తు ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రం రుద్రవరంలో ప్రత్యేక అధికారి నాగరాజు ఆధ్వర్యంలో ఎంపీపీ బాలస్వామి, మండల పరిషత్ ఏఓ వరలక్ష్మి, ఈఓపీఆర్డీ శ్రీనివాసశర్మ, హెచ్‌ఎం సుబ్బరాయుడు తదితరులు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అమ్మవారిశాల నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా నిలిచి పరిసరాలు పరి శుభ్రంగా ఉంచుదాం, ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిద్దాం అంటూ ప్రతిజ్ఞ చేశారు.


విద్యార్థులతో అధ్యాపకుల బృందం

ఘనంగా ఫ్రెషర్స్ డే

ఆళ్లగడ్డ : నూతనంగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆడిటోరియంలో ప్రిన్సిపల్ శివరామయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా రోటరీ క్లబ్ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యతోనే ఉన్నత శిఖరాలు చేరుకుంటారన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గంగన్న, అధ్యాపకులు నాగమస్తాన్, రాజు, జయచంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, సంధ్యారాణి పాల్గొన్నారు.